క్లుప్తంగా

ఫ్లోర్ క్లీనర్ వితరణ



ఫ్లోర్ క్లీనర్‌ను అందజేస్తున్న గ్రీన్ ప్యానెల్ ప్రతినిధులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి తొట్టంబేడు సమీపంలోని గ్రీన్ ప్యానెల్ ఇండస్ట్రీస్ వారు శుభ్రం చేసే ఆటోమేటిక్ స్క్రబ్ అండ్ డ్రైవర్ ఫ్లోర్‌క్లీనర్‌ను అందజేశారు. ఈవో నాగేశ్వరరావు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దర్శనం ఏర్పాట్లు చేశారు.

స్కూటరిస్ట్‌కు గాయాలు

ఏర్పేడు: సీతారాంపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్ట్‌కి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు అందించిన వివరాలు.. తిరుపతికి చెందిన చంద్రశేఖర్(38) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా సీతారాంపేట వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో స్కూటరిస్ట్‌కి గాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

100 శాతం పింఛన్ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శుక్ర, శనివారాల్లో సామాజిక పింఛన్ల పంపిణీని వలంటీర్లు వంద శాతం పూర్తి చేశారని ఎంపీడీవో కార్యాలయ ఏవో త్రివిక్రమ్‌రావు తెలిపారు. శుక్రవారం ఉదయం ఐదు గంటల నుంచి వలంటీర్లు పింఛన్ పంపిణీని చేపట్టినట్టు పేర్కొన్నారు. ప్రతినెలా ఇంటికి వచ్చి పింఛన్ ఇవ్వడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

ముమ్మరంగా శ్మశాన వాటిక అభివృద్ధి పనులు

ఏర్పేడు: గాండ్లవీధి శ్మశాన వాటిక అభివృద్ధి పనులు శనివారం సర్పంచ్‌ల సంఘం మడలం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య ఆధ్వర్యంలో ముమ్మరంగా సాగుతున్నాయి. ఏర్పేడు పంచాయతీ పరిధిలోని గాండ్లవీధి శ్మశానంలో దట్టంగా ముళ్లపొదలు పెరిగాయి. మృతదేహాలు ఖననం చేయడానికి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వారి విన్నపం మేరకు జేసీబీతో ముళ్లపొదల తొలగింపు చేపట్టి సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

బాలికపై అత్యాచార యత్నం

కేవీబీపురం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 9 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారానికి యత్నించాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం.. మండలంలోని ఒక గ్రామానికి చెందిన జగదీష్ (28) అదే గ్రామానికి చెందిన 9 ఏళ్ల బాలికపై గత గురువారం రాత్రి అత్యాచారానికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో పరారయ్యాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జగదీష్‌ను శనివారం అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. విచారణలో గతంలో కూడా జగదీష్ అదే బాలికపై రెండు సార్లు అత్యాచారానికి యత్నించినట్టు తేలిందన్నారు.

దివ్యాంగులకు ఆర్టీసీ రాయితీ

శ్రీకాళహస్తి: బస్సు ప్రయాణాల్లో ఇతర రాష్ట్రాలకు వెళ్లే దివ్యాంగులకు 50 శాతం రాయితీ కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ డిపో మేనేజర్లు ఈ ఉత్తర్వులను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

దళితులు ఐక్యంగా ఉండాలి

రేణిగుంట: దళితులు ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు అన్నారు. మండలంలోని జీపాళెంలోని అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేద్కర్ స్టార్ కృష్ణ ఇంటికి ఆయన శనివారం వచ్చారు. కృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. మాల మహానాడు ఆధ్వర్యంలో అప్పట్లో చేసిన ఉద్యమాలను గురించి నెమరు వేసుకున్నారు. ఆయన్ను స్టార్ కృష్ణ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, వెంకటేష్, శంకరయ్య, చలపతి, శ్రీనివాసులు, బిట్టు, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక భరోసా



రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న శివయ్య

ఏర్పేడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న కాలనీల లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ చేసి ఆర్థిక భరోసా కల్పించారని సర్పంచ్ నల్లపాలెం శివయ్య అన్నారు. శనివారం ఏర్పేడు పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పేద మహిళలకు మండలంలోని పాగాలి రెవెన్యూలో పంచాయతీ పరిధిలోని 83 మంది మహిళలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసినట్లు వివరించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు ఏర్పేడులో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామన్నారు. 60 మంది మహిళా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. వీఆర్వో బాలాజీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివచంద్ర పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు సిద్ధం

మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తిలో సర్వం సిద్ధమైంది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 14 రోజులపాటు వైభవంగా ఉత్సవాలు జరగనున్నాయి. సోమవారం ముక్కంటికి ప్రియభక్తుడైన భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ జరగనుంది. శనివారం నాటికి మహాశివరాత్రి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీకాళహస్తి పట్టణవ్యాప్తంగా విద్యుత్ దీపకాంతులతో విరాజిల్లుతోంది. స్వర్ణముఖి నది వంతెనపై నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం రాత్రి శోభాయమానంగా దర్శనమించింది. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభం కానున్నాయి.

-శ్రీకాళహస్తి




ఆకట్టుకుంటున్న దేవతా మూర్తుల కటౌట్



పూల అలంకరణలను సిద్ధం చేస్తున్న సిబ్బంది



ఆలయంలో ఏర్పాట్లు



భక్తకన్నప్ప ఆలయం



స్వామి అమ్మవార్ల నగలు



నగలను పరిశీలిస్తున్న ఈవో తదితరులు

నగల పరిశీలన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్వామి,అమ్మవార్లకు అలంకరించే నగలను శనివారం బ్యాంక్ లాకర్ నుంచి బయటకు తెచ్చారు. అనంతరం వాటిని పరిశీలించి, ఆలయానికి తరలించారు. కార్యక్రమంలో ఈఓ నాగేశ్వరరావు, సహాయ కమిషనర్ మల్లికార్జునప్రసాద్ పాల్గొన్నారు.

ఈ–పంట నమోదుపై సామాజిక తనిఖీ గ్రామసభ



ఈ క్రాప్ నమోదు ముసాయిదాను ప్రదర్శిస్తున్న ఏవో భారతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో శనివారం ఈ–పంట నమోదుపై సామాజిక తనిఖీ గ్రామసభను మండల వ్యవసాయాధికారిణి భారతి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 3,218 మంది రైతులకు సంబంధించిన 8587 ఎకరాల భూమిలో సాగుచేసిన పంటలను ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. దీనిపై ముసాయిదా జాబితాను ప్రదర్శించి, అన్ని వివరాలను రైతులకు వినిపిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలుంటే తెలియజేస్తే సవరణ చేస్తామన్నారు. ఈ క్రాప్ బుకింగ్ వల్ల రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాలు సమయంలో పంట నష్ట పరిహారం, మద్దతు ధరపై పంటల కొనుగోలు చేయడం వంటి ప్రభుత్వ పథకాలకు అర్హత లభిస్తుందని తెలిపారు.

చెరివి పంచాయతీ నిధుల వినియోగంపై విచారణ



చెరివి పంచాయతీలో పనుల వివరాలు తెలుసుకుటున్న డీఎల్‌పీవో రవీంద్రబాబు

సత్యవేడు: మండలంలోని చెరివి పంచాయతీ నిధులు వినియోగంపై జిల్లా పంచాయతీ అధికారులు విచారణ చేపట్టారు. పంచాయతీ పరిధిలో నిధులు సక్రమంగా వినియోగించలేదని కార్యదర్శి, చెరివి సర్పంచ్‌పై పంచాయతీకి చెందిన డాక్టర్ విజయ్‌కుమార్ డీపీవోకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం డీఎల్‌పీవో రవీంద్ర బాబు, ఈవోపీఆర్డీ మునిరవికుమార్ సచివాలయంలో విచారణ చేపట్టారు. పంచాయతీలో చేపట్టిన పనుల వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం పంచాయతీ రికార్డులు ఆడిట్‌లో ఉన్నాయని, ఆడిట్ పూర్తయిన తర్వాత పరిశీలించి డీపీవోకు నివేదిక అందజేస్తామన్నారు.

ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు కల్పించండి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగ: వేసవి సందర్భంగా ఎండలకు ఉపాధి కూలీలు వడదెబ్బ బారిన పడకుండా పనుల వద్ద నీరు, నీడ సౌకర్యాలతోపాటు, ప్రథమ చికిత్స బాక్స్ ఉండేలా చూడాలని జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన శనివారం పల్లమాల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ.272ల వేతనం వస్తుందని తెలిపారు. రోజుకు 5 వేల మంది పనిచేయాలని, కూలీల సంఖ్య తగ్గకుండా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో పండ్లతోటల పెంపకం చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించి, వారి నుంచి నెలాఖరులోపు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో భానుప్రియ, టెక్నికల్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ



బీఎన్‌కండ్రిగలో సరస్వతి అమ్మవారి చిత్రపటానికి పూజ చేస్తున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ చదువుతున్న విద్యార్థులు శనివారం సరస్వతి పూజను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థిని, విద్యార్థులంతా సంప్రదాయ దుస్తులు ధరించి, కొవ్వొత్తులతో ఓంకార ప్రతిమ ముందు జ్యోతిని వెలిగించి పూజలు చేశారు. ఉపాధ్యాయుల నుంచి ఆశీర్వాదం అందుకున్నారు. ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ మాట్లాడుతూ మార్చి 18వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు జరగనున్నాయని, ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే పదవ తరగతి పాఠశాల దశ కీలకమైనదని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదవితే మంచి మార్కులు సాధించవచ్చునని తెలిపారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీమురళి, సురేష్‌బాబు, నాదెండ్లమురళి, వేణుగోపాల్, దాసు, మాధవీలత, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీధులను పరిశుభ్రంగా ఉంచుదాం

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నాలుగు మాడవీధులతోపాటు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని పురపాలక సంఘ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. శనివారం పురపాలక సంఘ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం పరిశుభ్రంగా ఉండాలని, బ్లీచింగ్ చల్లి శుభ్రం చేయాలన్నారు. రద్దీ ప్రాంతాలను గుర్తించి ప్రత్యేకంగా తాగునీటి వసతి కల్పించాలని, వాటర్ క్లోరినేషన్ చేయాలని ఎక్కడా నీటి లీకేజీలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు మాడ వీధుల్లో ప్రతిరోజు స్వామి అమ్మవార్ల ఊరేగింపు జరుగుతున్న నేపథ్యంలో ఎక్కడా ఫ్లెక్సీలు లేకుండా చూడాలన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

రేణిగుంట: కరకంబాడి పంచాయతీలో ఆదివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు రేణిగుంట ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్ తెలిపారు. కరకంబాడి రాజీవ్‌నగర్, కరకంబాడి దళితవాడ, అరుంధతీవాడలలో శ్మశాన వాటికల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమిపూజ, కరకంబాడి గ్రామం, దొడ్లమిట్ట శ్మశాన వాటికకు భూమిపూజ చేయనున్నట్లు వారు వివరించారు. పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు డైనమిక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు. వరదయ్యపాళెంలోని గోవర్ధనపురం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చెన్నైకు చెందిన శంకర నేత్రాలయ వైద్యులు పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి చెన్నైలో ఆపరేషన్ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం విక్రేత అరెస్ట్

కేవీబీపురం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వగత్తూరు గ్రామానికి చెందిన బాబు(48) అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం అందిందన్నారు. శనివారం సాయంత్రం గ్రామానికి చేరుకుని దాడులు నిర్వహించామని తెలిపారు. అతని వద్ద 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి న్యాయం స్థానం ముందు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు. పీసీలు గంగాధర్, ప్రభాకర్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వరదయ్యపాళెం: సూళ్లూరుపేట– బీఎన్‌కండ్రిగ మార్గమధ్యంలో శనివారం రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ ప్రతాప్ కథనం మేరకు..తొట్టంబేడు మండలం, పాయ్యకొత్తూరుకు చెందిన చిన్న వెంకటసుబ్బయ్య, కుమారుడు మురళి, కుమార్తె సుభాషిణితో కలిసి సూళ్లూరుపేట సమీపంలో బంధువుల ఇంట్లో జరిగే వేడుకకు బయలుదేరాడు. బీఎన్‌కండ్రిగ–సూళ్లూరుపేట రోడ్డులోని కొమ్ముల ఫ్యాక్టరీ సమీపంలో తమిళనాడు నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న యువకుల బైక్ అతివేగంగా వచ్చి ఢీకొంది. చిన్న వెంకటసుబ్బయ్య (75)కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కుమారుడు మురళి, కుమార్తె సుభాషిణికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పిల్లలకు పోలియో చుక్కలు వేయించండి

శ్రీకాళహస్తి: 5 ఏళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఇన్‌చార్జి రమేష్‌బాబు కోరారు. ఆయన శనివారం శ్రీకాళహస్తిలోని బాబు అగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో ఏపీజే అబ్దుల్ కలాం స్కౌట్స్ ట్రూప్, గైడ్స్ విద్యార్థులతో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ చేపట్టారు. షేక్ అజారుద్దీన్, పార్వతి, యోగానంద, ధనుష్ పాల్గొన్నారు.

సత్యవేడు: ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ గుణశేఖర్ తెలిపారు. మండలంలోని 28 పంచాయతీల్లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణపై ఆటో ద్వారా ప్రచారం చేయించారు.

నాగలాపురం: మండలంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్టు డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. బైటకొడియంబేడు, కృష్ణాపురం, గోపాలపురం, నాగలాపురం, ఎస్ఎస్‌పురం, టీపీపాలెంలో 38 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఏర్పేడు: చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. శనివారం మండలంలోని ఎండీపుత్తూరులో పల్స్‌పోలియోపై ర్యాలీ నిర్వహించారు.

పిచ్చాటూరు: మండలంలో ఉన్న ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హమీద్ పిలుపునిచ్చారు. ఆయన శనివారం పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ చేపట్టారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ: ఐదేళ్లలోపు ఉన్న ప్రతి బిడ్డకూ రెండు పోలియో చుక్కలు వేయించి నిండు జీవితానికి భరోసా కల్పించాలని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. ఆయన శనివారం బుచ్చినాయుడుకండ్రిగలోని మెయిన్ రోడ్డులో పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని ఆటోలో ప్రచారం చేశారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

రేణిగుంట: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసి పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని మండల వైద్యాధికారి డాక్టర్ ఛత్రప్రకాష్‌రెడ్డి కోరారు. శనివారం రేణిగుంట పీహెచ్‌సీ నుంచి ప్రధాన వీధుల మీదుగా ఆర్టీసీ బస్టాండు వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. మండలంలో 39 కేంద్రాల్లో, విమానాశ్రయం, రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండు ఆవరణలో పోలియో చుక్కలు వేయనున్నట్లు వివరించారు. వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో ఆశా సంస్థ అధ్యక్షుడు జూలియస్ రాజు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మహిళలకు పెద్దపీట వేసిన సీఎం జగనన్న



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి

- వైఎస్ఆర్ ఆసరా చెక్కులు అందజేత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: దేశ చరిత్రలోనే మహిళలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలో వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు డ్వాక్రా రుణ మాఫీ అని చంద్రబాబు మహిళలను మోసం చేశారన్నారు. అయితే నేడు జగనన్న మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా నిధులను విడుదల చేశారన్నారు. అందులో భాగంగా శ్రీకాళహస్తి మండలంలో 10,990 మంది మహిళలకు రూ.10,63,53,350 వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. మహిళల సాధికారత లక్ష్యంగా సీఎం జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మహిళల ఆశీర్వాదాలు సీఎంకు ఉండాలన్నారు. ఇక శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత పాలకులు ఎన్నికలు అయిపోగానే హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు వెళ్లేవారని అయితే ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాత్రం నిత్యం ప్రజల మధ్యనే ఉన్నారన్నారు. వారికి సేవ చేస్తున్నారన్నారు. మరోసారి ఆయన్ను గెలిపించుకోవాలన్నారు. అనంతరం ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి మాట్లాడుతూ జగనన్న ప్రజా సంకల్పయాత్రలో మహిళలు పడుతున్న కష్టాలను గుర్తించి నాడు ఇచ్చిన మాట ప్రకారం ద్వారా రుణ మాఫీని నాలుగో విడత పంపిణీ చేశారన్నారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. నియోజవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వయ్యాల కృష్ణారెడ్డి, కందాటి ఈశ్వర్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, బాలిరెడ్డి, సురేంద్రయాదవ్, రమేష్‌యాదవ్, శివకుమారి, రజని, రాములమ్మ, కృష్ణయ్య, యుగంధర్‌రెడ్డి, భూషణయాదవ్, చెంచయ్యయాదవ్, మధుమోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, రవి, అంకయ్య, వయ్యాల మనోహర్‌రెడ్డి, చెంచయ్యనాయుడు, సుబ్బరామయ్య, బాలగురునాథం, రఘు, కేశవరెడ్డి, పుల్లయ్య, మనోహర్, నారాయణ, సుబ్రహ్మణ్యం, దిలీప్, నక్క పెంచలయ్య, రామచంద్రయ్య, పోలయ్య, రవీందర్ రెడ్డి, ఎంపీడీవో రఫీఖాన్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో సీఎం జగనన్నకు తోడుగా నిలుద్దాం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయడం ద్వారా సీఎం జగనన్నకు తోడుగా నిలవాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆమె తొట్టంబేడు మండలం శ్రీకృష్ణాపురం, కారాకొల్లు, తుమ్మలగుంట, దొంగలముడూరు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో జగన్‌ను ఎదుర్కొనేందుకు ఎంతమంది ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు ఓటు అనే ఆయుధంతో భగ్నం చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. వైఎస్ఆర్ సీపీ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ, సర్పంచి లత, వైస్ ఎంపీపీ గెరటారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మణినాయుడు, నాయకులు కోవి చంద్రయ్యనాయుడు, గంగాధర్, వెంకటరమణారెడ్డి, రఘురామయ్య, రవీంద్రనాయుడు, జగదీష్, సిద్దయ్య, ప్రసాద్, సుబ్రమణ్యం, రాజేంద్ర, చంద్రయ్య, చెంచు, కృష్ణయ్య, రాజేష్, సురేష్, చిరంజీవి, శివ, వెంకటేశ్వర్లు, మణి, సుబ్రమణ్యం, బాబు, వీరరాఘవులు, చంద్ర, బత్తెయ్య, దశయ్య, వెంకటరమణ, రవీంద్ర, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు వరదయ్యపాళెంకు ఎంపీ మద్దెల గురుమూర్తి

వరదయ్యపాళెం: తిరుపతి ఎంపీ గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆదివారం వరదయ్యపాళెం మండలంలో పర్యటించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయఆవరణలో ఆదివారం ఉదయం జరిగే వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ముస్లింపాళెం, సీఎల్ఎన్‌పల్లి, మరదవాడ, సంతవేలూరు గ్రామ పంచాయతీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

సంక్షేమం కొనసాగాలంటే జగనన్నే రావాలి

రేణిగుంట: నవరత్నాలు రూపంలో పేదలకు నేరుగా అందిస్తున్న సంక్షేమ ఫలాలు కొనసాగాలంటే 2024 ఎన్నికల్లో సీఎంగా జగనన్నే మళ్లీ రావాలని ఎమ్మెల్సీ సభ్యుడు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. రేణిగుంట మండలం తూకివాకం గంగుంటలో ఇటీవల మృతి చెందిన అరవ డేవిడ్ కుటుంబీకులకు ఆయన శనివారం సిపాయి భరోసా పంపిణీ చేశారు. తొలుత వారి చిత్ర పటాలకు నివాళులర్పించి, అనంతరం 40 రకాల నిత్యావసర సరుకులతో కూడిన కిట్‌ను అందజేశారు. గతంలో టీడీపీవారు చేసిన 400 వాగ్దానాలను పూర్తిగా విస్మరించి 2019లో చిత్తుచిత్తుగా ఓడారని గుర్తు చేశారు. గెలిచిన మొదటి రోజు నుంచి ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబిల్‌గా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను పేదలకు అందించారన్నారు. రాష్ట్రంలో పేదలు, అట్టడుగు వర్గాల ప్రజల సంక్షేమం కోసం నవరత్న పథకాలను అమలు చేస్తూ రూ.2.5 లక్షల కోట్లు నగదు నేరుగా పేదల ఖాతాల్లోకి జమ చేసిన రాష్ట్రం ప్రపంచంలోనే ఎక్కడా లేదన్నారు. ఎంపీటీసీ సభ్యుడు ఆనందరావు, పల్లవి, రమణమ్మ, సత్యమ్మ, అజయ్, నవీన్, రియో, అశోక్, శ్రావణి, డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



సిపాయి భరోసా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

మృతుల కుటుంబాలకు సిపాయి భరోసా

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): చుక్కలనిడిగల్లు ఎస్టీకాలనీలో ఇటీవల రమేష్, సుహాసిని అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రష్ అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం శనివారం కాలనీకి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులకు 42 రకాల నిత్యావసర సరుకులతో కూడిన కిట్‌ను అందజేశారు. మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తామని వారికి భరోసా ఇచ్చారు. సిపాయి సుబ్రమణ్యం చేస్తున్న సేవలకు ఆకర్షితులైన కాలనీ వాసులు 20 మంది టీడీపీ నుంచి వైసీపీలో చేరేందుకు ముందుకు రావడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రత్నంరెడ్డి, వడ్లతాంగల్ బాలాజీప్రసాద్ రెడ్డి, వెంకటాద్రి, పాస్టర్ దేవి ప్రసాద్, భాస్కర్, జగదీష్, దాము, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.